క్లుప్తంగా

శబరిమలకు తరలివెళ్లిన భక్తులు



ఇరుముడులతో తరలివెళుతున్న మాలధారులు

కోడుమూరు రూరల్: అయ్యప్పమాల ధరించిన 30 మంది భక్తులు సోమవారం కోడుమూరులోని శ్రీధర్మపురి అయ్యప్పస్వామి ఆలయం నుంచి శబరిమలకు తరలివెళ్లారు. అయ్యప్ప మాల ధరించిన స్వాములు 41 రోజులు నియమనిష్ఠలతో పూజలు చేసి శబరిమల అయ్యప్పను దర్శించుకుని ఇరుముడులు సమర్పించేందుకు యాత్ర చేపట్టారు. వీరిని స్థానిక అయ్యప్పస్వామి ఆలయ కమిటీ సభ్యులు భాస్కర్‌రెడ్డి, జీతూరి రవి, అశోక్, బాలాజీతో పాటు, స్వాముల కుటుంబ సభ్యులు సాగనంపారు.

పనుల వివరాలను పక్కాగా నమోదు చేయాలి



మాట్లాడుతున్న ఆర్‌డబ్ల్యూఎస్, పీఆర్ ఏఈలు గోనేనాయక్, వెంకటప్రకాష్

సి.బెళగల్: గ్రామాల్లో జరిగే అభివృద్ధి పనుల వివరాలను రికార్డులలో పకడ్బందీగా నమోదు చేయాలని గ్రామ సచివాలయాల ఇంజినీర్ అసిస్టెంట్లకు ఆర్‌డబ్ల్యూఎస్, పీఆర్ ఏఈలు గోనేనాయక్, వెంకటప్రకాష్ సూచించారు. వారు సోమవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఇంజినీరింగ్ అసిస్టెంట్లతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఈలు మాట్లాడుతూ.. ప్రభుత్వ అనుమతులు, నిధుల వివరాల పత్రాల తయారీ, నిధులు, ఖర్చులు ఎం బుక్‌లలో నమోదుపై అవగాహన కల్పించారు. అదేవిధంగా గ్రామాల్లో జరిగే అభివృద్ధి పనుల పర్యవేక్షణ విధానాలను ఏఈలు తెలియజేశారు.

రుణాలను సద్వినియోగం చేసుకోండి



రైతుకు పంటకోత యంత్రాన్ని అందజేస్తున్న ఏపీజీబీ ఆర్‌ఎం నవీన్‌కుమార్

కోడుమూరు రూరల్: ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంకు ద్వారా అందిస్తున్న రుణాలను రైతులు, ప్రజలు సద్వినియోగం చేసుకుని ఆర్థికాభివృద్ధి సాధించాలని రీజనల్ మేనేజర్ నవీన్‌కుమార్ సూచించారు. సోమవారం కోడుమూరు ఏపీజీబీ పరిధిలో నలుగురు రైతులకు రూ.1.96 కోట్లు విలువ చేసే పంట కోత యంత్రాలను బ్యాంకు మేనేజర్ సుదర్శన్‌రెడ్డి పంపిణీ చేశారు. ఆర్‌ఎం నవీన్‌కుమార్, సీనియర్ మేనేజర్ ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, గూడూరు బ్రాంచ్ మేనేజర్ విజయశాంతి, సిబ్బంది పాల్గొన్నారు.

త్రైత సిద్ధాంత భగవద్గీత ప్రచారం



ప్రచారం చేస్తున్న సభ్యులు

కల్లూరు: మండల పరిధిలోని పెద్దకొట్టాల, చిన్నకొట్టాల గ్రామాల్లో త్రైత సిద్ధాంత ప్రబోధ సేవాసమితి ఇందూ జ్ఞానవేదిక కల్లూరు కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో సోమవారం త్రైతసిద్ధాంత భగవద్గీత ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో కల్లూరు కమిటీ అధ్యక్షుడు, సభ్యులు పురుషోత్తం, ఈశ్వరయ్య, సుధాకర్, ఓబులేసు, గిరి, వేణు, లత, సునీత, మౌనిక, మహేశ్వరి, సురేఖ తదితరులు పాల్గొన్నారు.

విద్యారంగ సమస్యలు పరిష్కరించాలి



తహసీల్దార్ నరేంద్రనాథ్‌రెడ్డికి వినతి పత్రం ఇస్తున్న విద్యార్థి సంఘాల నాయకులు

పాణ్యం: మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాల లు, జూనియర్ కళాశాలల్లో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలని కోరుతూ తహసీల్దార్ నరేంద్రనాథ్‌రెడ్డికి విద్యార్థి సంఘాలు, నాయకులు సోమవారం వినతి పత్రం అందించారు. వారు మాట్లాడు తూ.. పాణ్యంలోని జిల్లా పరిషత్ పాఠశాల నిర్మించి 40 ఏళ్లు పూర్తయినా నేటికీ కాంపౌండ్‌వాల్ లేద న్నారు. అలాగే మౌళిక సదుపాయాలు లేక విద్యార్థు లు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఇక్కడే ఇంటర్, డిగ్రీ కళాశాలలు ఉన్నాయని అయినా ఎలాంటి అభివృద్ధి జరగలేదని వాపోయారు. మండలంలో 13 పాఠశాలలకు మౌళిక వసతులు, కాంపౌండ్‌వాల్ లేక ఇబ్బందులు పడుతున్నట్లు చెప్పారు. ప్రభుత్వం తక్షణమే చొరవ తీసుకొని సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు. విద్యార్థి నాయకులు ఎస్కే జువైద్, బత్తిన ప్రతాప్, అరుణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పశుగ్రాసానికి డిమాండ్

- ఎకరం గడ్డి ధర రూ.3 వేలు
- రెండు మండలాల్లో 13 వేల హెక్టార్లలో వరి సాగు

గడివేముల: వరి కోతలు మొదలైతే చాలు పశుగ్రాసం కోసం పాడి రైతులు క్యూ కడతారు. ఒకప్పుడు వ్యవసాయ కూలీలు వరి కోతలు కోయడం, చేతులతో కట్టలు కట్టి తూర్పారబట్టాక ధాన్యం వేరు చేసే వారు. దీంతో పశుగ్రాసం పుష్కలంగా లభించేది. అయితే కాలక్రమేణా సాంకేతిక పరిజ్ఞానం పుంతలు తొక్కుతుండటం, సులువుగా వరి ధాన్యం వేరు చేసి క్షణాల్లో పని పూర్తిచేసే యంత్రాలు రావడంతో పశుగ్రాసానికి డిమాండ్ నెలకొంది. అప్పట్లో రైతులు పశుగ్రాసానికి డబ్బులు తీసుకోకుండానే పాడి రైతులకు తీసుకెళ్లమని చెప్పేవారు. కానీ నేడు పరిస్థితులు అందుకు భిన్నంగా ఉన్నాయి. దీంతో పశుగ్రాసానికి విపరీతమైన డిమాండ్ నెలకొంది. గడివేముల మండల పరిధిలో వరి సాగు విస్తీర్ణం అధికంగా ఉంది. ప్రస్తుతం కోతలు ముమ్మరం కావడంతో పంట పొలాల్లో వరి కోత మిషన్లు నూర్పిళ్లు చేస్తున్నాయి. మండలంలో ఇప్పటికే 75 నుంచి 80 శాతం వరి కోతలు పూర్తయ్యాయి. మిగిలిన వరి పొలాలు కోతలకు సిద్ధంగా ఉన్నాయి. వరి కోతలు జరిగే సమయంలో ఉమ్మడి కర్నూలు, నంద్యాల జిల్లాలతో పాటు రాయలసీమలోని అనంతపురం, ప్రకాశం జిల్లా గిద్దలూరు, ఒంగోలు తదితర ప్రాంతాల నుంచి పాడి రైతులు పశుగ్రాసం కోసం మహానంది, బండి ఆత్మకూరు మండలాల వైపు వస్తుంటారు. ప్రస్తుతం ఏ పొలంలో చూసినా వరికోత మిషన్లు రంగంలోకి దిగి పంట కోతలు చేస్తున్నాయి. దీంతో పశుగ్రాసాన్ని పాడి రైతులు కొనుగోలు చేస్తూ ట్రాక్టర్లు, లారీల ద్వారా తీసుకుని వెళ్తున్నారు.

4 వేల హెక్టార్లలో వరిసాగు

మండలంలో 4 వేల హెక్టార్లలో వరి సాగయ్యింది. గడివేముల మండలంలో అత్యధికంగా 10 వేల ఎకరాలల్లో వరి సాగయ్యింది. ప్రతి ఏడాది ఖరీఫ్, రబీ సీజన్లలో వరి విస్తీర్ణం అధికంగా ఉండడంతో సమీప జిల్లాల నుంచి పాడి రైతులు పశుగ్రాసాన్ని కొనుగోలు చేసేందుకు మండలం వైపు వస్తున్నారు.



వరిగడ్డి కట్టలను ట్రాక్టర్‌లో లోడ్ చేస్తున్న కూలీలు

ఎకరం గడ్డి రూ.2,500 నుంచి రూ.3 వేలు

ఒక ఎకరా వరి పొలంలో గడ్డిని కొనుగోలు చేసేందుకు పాడిరైతులు రూ.2,500 నుంచి రూ.3 వేల వరకు వెచ్చించాల్సి వస్తోంది. టైర్ల మిషన్లతో కోసిన పొలాల్లో వరిగడ్డి నాణ్యంగా ఉండడంతో పాటు అధికంగా లభ్యం అవుతుంది. అదే చైన్ల మిషన్లతో అయితే గడ్డి కొంత పాడవడంతో పాటు లభ్యత తక్కువగా ఉంటుంది. గతంలో లాగా వరి వాముల తరహాలో తీసుకెళ్లడం కష్టతరంగా మారడంతో ప్రస్తుతం చక్రాల్లాగా బేళ్లు కడుతూ రవాణాకు సులువుగా మారింది. అధిక శాతం బేళ్లను చుట్టుకొని ట్రాక్టర్ల ద్వారా తరలిస్తున్నారు. ఒక్కొక్క బేడు సుమారు 20 నుంచి 30 కిలోల వరకు ఉంటుంది. ఒక్కొక్క బేడు ధర రూ.70 నుంచి రూ.90 వరకు మార్కెట్లో విక్రయిస్తున్నారు. దీంతో బేళ్లను రవాణా చేసేందుకు వ్యవసాయ కూలీలకు సైతం ఉపాధిగా మారింది.

ఇతర జిల్లాలకు పశుగ్రాసం ఎగుమతి



మండలంలో ప్రస్తుతం వరి కోతలు జోరుగా సాగుతున్నాయి. మాకు దగ్గరలో ఉన్న బండిఆత్మకూరు మండలంలో వరి అధిక విస్తీర్ణంలో సాగుచేస్తారు. కోతల సమయంలో ఇతర ప్రాంతాల నుంచి పాడి రైతులు వచ్చి వరిగడ్డిని కొనుగోలు చేసి తీసుకెళుతుంటారు. అలాగే ఇతర జిల్లాలకు వరిగడ్డిని ఎగుమతి చేస్తారు. ఎకరం వరిగడ్డి రూ.2500 నుంచి రూ.3 వేల వరకు పలుకుతోంది. – ఉశేని, గడివేముల

కురువల అభ్యున్నతికి కృషి



కురువ సంఘం సభ్యులను సన్మానిస్తున్న దృశ్యం

గడివేముల: కురువలు ఆర్థికంగా అభివృద్ధి చెందేందుకు కృషి చేస్తానని కర్నూలు ఎంపీ బస్తిపాడు నాగరాజు భరోసా ఇచ్చారు. కార్తీక మాసం చివరి సోమవారం కావడంతో గడివేముల మండల పరిధిలోని బిలకలగూడూరు గ్రామంలో కరువ వర్గీయు ల వన భోజన కార్యక్రమం నిర్వహించారు. కురువ సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ గుడిసె శివన్న, ఉమ్మడి జిల్లా ప్రధాన కార్యదర్శి ఎంకే రంగస్వామి, జిల్లా ఉపాధ్యక్షుడు కత్తి రంగస్వామి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. వారు మాట్లాడుతూ కురవ కులస్తులందరూ ఐకమత్యంగా ఉంటే ఏదైనా సాధించవచ్చన్నారు. అనంతరం ఉసిరి వృక్షానికి పూజా కార్యక్రమం నిర్వహించి, భక్త కనకదాసు చిత్రపటానికి పూలమాలలు వేసి జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. జిల్లా కార్యవర్గ సభ్యుడు పాపారాయుడు, నంద్యాల పట్టణ కురువ సంఘం గౌరవాధ్యక్షుడు పుల్లయ్య, అల్లే బాబు, రామస్వామి, రామకృష్ణ, యుగంధర్, మొగిలి శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

శ్మశానానికి స్థలం కేటాయించాలి



తహసీల్దార్ విద్యాసాగర్‌కు వినతిపత్రం సమర్పిస్తున్న మైనార్టీ నాయకులు

ఓర్వకల్లు: మండలంలోని నన్నూరు గ్రామంలో ముస్లిం మైనార్టీల శ్మశాన వాటికకు స్థలాన్ని కేటాయించాలని ఆ గ్రామ మైనార్టీ నాయకులు తహసీల్దార్ విద్యాసాగర్‌కు విన్నవించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. నన్నూరులో మైనార్టీ ప్రజలకు ప్రస్తుతం ఉన్న శ్మశాన వాటిక సరిపోవడం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. గ్రామంలో 20 వేల మంది జనాభా ఉండగా 40 శాతం మంది ముస్లింలు ఉన్నారని చెప్పారు. వారి ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని శ్మశాన వాటికకు స్థలాన్ని చూపించాలని డిమాండ్ చేశారు. అనంతరం తహసీల్దార్ విద్యాసాగర్‌కు వినతి పత్రం అందజేశారు. స్థానిక నాయకులు సుబ్బారెడ్డి, కృష్ణారెడ్డి, మైనార్టీ నాయకులు ఖాజామియా, శంషుద్దీన్, ఇమ్రాన్‌ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

పీజీఆర్ఎస్‌కు స్పందన కరువు



సి.బెళగల్ పీజీఆర్ఎస్ కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీనివాసరెడ్డి, అధికారులు

సి.బెళగల్: ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) కార్యక్రమానికి మండల ప్రజల నుంచి స్పందన కరువైంది. సోమవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ శ్రీనివాసరెడ్డి పీజీఆర్ఎస్‌ను నిర్వహించారు. కార్యక్రమానికి మండల అధికారులు తరచూ హాజరు కాకపోవడం, అర్జీలను పరిష్కరించడంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుండటంతో ప్రజలు తమ సమస్యలను మండలాధికారులకు చెప్పుకునేందుకు విముఖత చూపుతున్నారు. దీంతో సోమవారం నిర్వహించిన పీజీఆర్ఎస్ కార్యక్రమానికి ఒక్క అర్జీ కూడ రాలేదు. ఇదిలాఉండగా కొంతమంది మండలాధికారుల రెగ్యులర్‌గా కార్యక్రమానికి గైర్హాజరు కావడం, మరి కొంతమంది ఇలా వచ్చి అలా వెళ్లడాన్ని గమనించిన తహసీల్దార్ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న అధికారుల తీరుపై మండిపడ్డారు. ప్రతి సోమవారం మండల అధికారులందరు తప్పనిసరిగా తహసీల్దార్ కార్యాలయంలో నిర్వహించే పీజీఆర్ఎస్‌కు హాజరవ్వాలని ఆదేశించారు. సంబంధిత అధికారుల నుంచి అనుమతులు లేకుండా, తమకు ఎలాంటి సమాచారం ఇవ్వకుండా పీజీఆర్ఎస్‌కు గైర్హాజరయ్యే అధికారులపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఏఓ మల్లేష్‌కుమార్, ఆర్‌డబ్ల్యూఎస్, విద్యుత్ ఏఈలు గోనేనాయక్, సుకుమార్, వెలుగు ఏపీఎం రామేశ్వర్, ఈఓఆర్డీ ఈశ్వరయ్య స్వామి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ మల్లేశ్వరి, వీఆర్వోలు పాల్గొనగా మిగతా శాఖల అధికారులు గైర్హాజరయ్యారు.

సామాజిక తనిఖీలకు సహకరించాలి



సామాజిక తనిఖీ సమన్వయ సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీఓ రాణెమ్మ

సి.బెళగల్: మండలంలో ఉపాధి హామీ పనులపై త్వరలో చేపట్టనున్న సామాజిక తనిఖీ సభలకు ఆయా శాఖల మండలాధికారులు, ఉపాధి హామీ అధికారులు, సిబ్బంది సహకరించాలని ఎంపీడీఓ రాణెమ్మ సూచించారు. సోమవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సామాజిక తనిఖీ అధికారులు (డీఆర్పీలు), ఉపాధిహామీ అధికారులతో స్టేట్ రీసోర్స్ పర్సన్ (ఎస్ఆర్పీ) విజయభాస్కర్ సమన్వయ సమావేశం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎంపీడీఓ మండలంలోని గ్రామాల్లో సామాజిక తనిఖీ అధికారులు చేపట్టే అంశాలకు మండల అధికారులు సహకరించాలని సూచించారు. మండలంలో 2023 ఏప్రిల్ 1 నుంచి 2024 మార్చి 31వ తేదీ మధ్యకాలంలో మండల పరిధిలోని 18 గ్రామ పంచాయతీలలో పంచాయతీరాజ్, ఉపాధిహామీ పథకాలలో భాగంగా చేపట్టిన 964 పనులకు దాదాపు రూ.15.90 కోట్ల ఖర్చుపై సామాజిక తనిఖీ చేపట్టనున్నట్లు ఎస్ఆర్పీ తెలిపారు. పీఆర్ఏఈ వెంకటప్రకాష్, ఉపాధిహామీ ఏపీఓ రామన్న, ఈసీ పృథ్వీరాజ్, జేఈ రంగస్వామి, టీఏలు, ఎఫ్ఏలు, సీఓలు ఉన్నారు.

రేపు సామాజిక తనిఖీ సభ

పాణ్యం: స్థానిక ఎంపీడీఓ కార్యాలయం ఎదుట ఈనెల 27వ తేదీన ఉదయం 10 గంటలకు సామాజిక తనిఖీ బహిరంగ సభ ప్రారంభమవుతుందని ఏపీఓ విజయరాణి సోమవారం తెలిపారు. ఆమె మాట్లాడుతూ 1-4-2023 నుంచి 31-3-2024 వరకు ఉపాధి హామీ పథకం ద్వారా చేపట్టిన అన్ని పనులపై తనిఖీ చేపడుతున్నట్లు తెలిపారు. ఇప్పటికే గ్రామసభల ద్వారా పనులపై తనిఖీ పూర్తి కాగా మండల స్థాయిలో నిర్వహించనున్నట్లు చెప్పారు.

మిన్నంటిన శివనామస్మరణ

- భక్తులతో పోటెత్తిన కాల్వబుగ్గ క్షేత్రం
- పల్లకీలో విహరించిన ఉత్సవమూర్తులు
- దీపాలు వెలిగించి మొక్కులు తీర్చుకున్న మహిళలు



కాల్వబుగ్గ క్షేత్రంలో స్వామివారి దర్శనార్థం క్యూలో ఉన్న భక్తులు

ఓర్వకల్లు: కార్తీక మాసం చివరి సోమవారం కావడంతో మండలంలోని కాల్వబుగ్గలో వెలసిన బుగ్గరామేశ్వర స్వామి దేవస్థానం భక్తులతో కిటకిటలాడింది. ఆలయ ప్రధాన అర్చకుడు కల్లె లక్ష్మీనారాయణశర్మ స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించి, అభిషేకాది పూజలు నిర్వహించారు. స్వాముల వారిని దర్శించుకునేందుకు భక్తులు అధిక సంఖ్యలో తరలిరావడంతో ఆలయ క్షేత్రం భక్తులతో పోటెత్తింది. ఓం నమఃశివాయ, హరోం హర, అంటూ భక్తుల శివనామస్మరణతో ఆలయ పరిసరాలు మార్మోగాయి. స్వాము ల వారిని దర్శించుకునేందుకు భక్తులు ఉదయం నుంచే వరుసకట్టారు. మహిళలు స్థానిక చిన్న కోనే రు వద్ద ప్రవహిస్తున్న నీటిలో పుణ్యస్నానాలు ఆచరించి, స్వాముల వారి గర్భగుడి ఎదురుగా వున్న ధ్వజస్తంభం వద్ద భక్తిశ్రద్ధలతో దీపాలు వెలిగించి మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం స్వాముల వారిని దర్శించుకొని, ప్రత్యేక పూజలు నిర్వహించారు.

స్వాముల వారికి 40 అభిషేకాలు

ఈ సందర్భంగా స్వాముల వారికి 40 మంది భక్తులు కుటుంబసమేతంగా అభిషేకం నిర్వహించారు. కార్తీక మాసం నాలుగు వారాలలో కలిపి మొత్తం 120 మంది భక్తులు అభిషేకాలు నిర్వహించినట్లు ఆలయ ఈఓ మద్దిలేటి తెలిపారు. అలాగే నిత్యాన్నదాన సేవకుగాను భక్తుల నుంచి రూ.30 వేలు డిపాజిట్ సేకరించినట్లు అధికారులు వెల్లడించారు. రిటైర్డ్ కలెక్టర్ రామశంకర్‌నాయక్ దంపతులు, స్థానిక ఎంపీడీఓ శ్రీనివాసులు స్వాములవారిని దర్శించుకొని అభిషేకం, ప్రత్యేక పూజలు చేశారు.

పల్లకీలో విహరించిన ఉత్సవమూర్తులు

కార్తీక మాసంలో ప్రతి సోమవారం ఉత్సవ మూర్తులకు పల్లకీ సేవ నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. ఇందులో భాగంగానే ఆలయ అర్చకులు కల్లె నరసింహశర్మ శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించి ఉత్సవ మూర్తులను పల్లకిలో ఆశీనులగావించారు. ఉత్సవ మూర్తులు పల్లకిలో విహరించి భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ ఈఓ మద్దిలేటి పర్యవేక్షణలో సాగిన పల్లకి సేవలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని, ఆదిదంపతులను దర్శించుకొని తరించిపోయారు. కార్యక్రమంలో ఆలయ ట్రస్టుబోర్డు మాజీ చైర్మన్ గుర్రాల చెన్నారెడ్డి, బోర్డు సభ్యులు శివరాముడు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.



కొత్తూరులో అలంకరణలో సుబ్రమణ్యేశ్వరస్వామి

భోగేశ్వరంలో భక్తుల సందడి

గడివేముల: మండల పరిధిలోని గడిగరేవుల గ్రామ సమీపంలో వెలసిన శ్రీ దుర్గాభోగేశ్వరాలయం భక్తులతో కళకళలాడింది. అభిషేక ప్రియుడైన ఈశ్వరుడికి ప్రత్యేక అభిషేకాలు జరిగాయి. ఆలయ ఈఓ రామానుజన్ భక్తులకు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ఉదయం నుంచి ప్రారంభమైన స్వామివారి దర్శనం రాత్రి వరకు నిర్విరామంగా కొనసాగింది. కార్తీకమాసం, ఆలయ విశిష్టత గురించి ప్రధాన అర్చకులు శ్యాంసుందర్‌శర్మ, గిరినాథశర్మ భక్తులకు వివరించారు. భక్తులకు కాశిరెడ్డినాయన ఆశ్రమం, ఆర్యవైశ్య సంఘం, వీరశైవుల ఆధ్వర్యంలో అన్నప్రసాదాలు అందించారు. అనంతరం గడిగరేవుల గ్రామంలో స్వామివారికి గ్రామోత్సవం నిర్వహించారు. అలాగే ఏడూర్ల గవిలో వెలసిన శివలింగాన్ని భక్తులు అధిక సంఖ్యలో దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

వైభవంగా కార్తీక దీపోత్సవం

పాణ్యం: మండల కేంద్రంలోని శ్రీ పాణికేశ్వర స్వామి ఆలయంలో తెల్లవారుజాము నుంచి ప్రత్యేక పూజలు జరుగుతున్నాయి. అలాగే భక్తులు ఆలయం వద్దకు చేరుకొని పుణస్నానాలు ఆచరించి కార్తీక దీపాలు వెలిగించారు. అలాగే శ్రీ భృంగీశ్వర ఆలయం భక్తులతో కిటకిటలాడింది. తెల్లవారుజాము నుంచి ఆలయం ప్రాంగణం కార్తీక దీపాల కాంతులతో దర్శనమిచ్చింది. అలాగే శ్రీ అగస్త్యేశ్వర ఆలయంలో కార్తీక సోమవార పూజలు ఘనంగా జరిగాయి. కొత్తూరులో వెలసిన శ్రీవల్లి సుబ్రమణ్యేశ్వరస్వామి ఆలయంలో తెల్లవారుజాము నుంచే విశిష్ట పూజలు ప్రారంభమయ్యాయి. వివిధ గ్రామాల నుంచి ఆలయానికి చేరుకున్న భక్తులు కార్తీక దీపాలు వెలిగించి స్వామి వారిని దర్శించుకున్నారు.



కాల్వబుగ్గ క్షేత్రంలో ఉత్సవమూర్తులను పల్లకీలో ఊరేగిస్తున్న భక్తులు



భోగేశ్వరస్వామికి అభిషేకం చేస్తున్న భక్తులు

నేటి నుంచి శ్రీరామదాసు తిరునాల



శ్రీరామదాసు స్వామి

కోడుమూరు రూరల్: మండలంలోని లద్దగిరి గ్రామంలో వెలసిన శ్రీరామదాసు స్వామి తిరునాల ఉత్సవాలను ఈనెల 26 నుంచి 30వ తేదీ వరకు అంగరంగ వైభవంగా నిర్వహించేందుకు గ్రామస్తులు అన్ని ఏర్పాట్లు చేశారు. మంగళవారం స్వామివారి ఆరాధనతో ఉత్సవాలు ప్రారంభించి 27న నందికోల సేవ, 28న రథోత్సవం, 29న గుర్రం పారువేట, 30న వసంతోత్సవం కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు.

లింగ వివక్షను నిర్మూలించాలి



సి.బెళగల్‌లో అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న అధికారులు

సి.బెళగల్: లింగ వివక్షను నిర్మూలించేందుకు ప్రజలందరూ కృషి చేయాలని ఎంపీడీఓ శ్రీనివాసులు సూచించారు. సోమవారం సి.బెళగల్‌లోని స్త్రీ శక్తి భవన్ వద్ద.. జెండర్ ఆధారిత హింసకు వ్యతిరేకంగా జాతీయ కార్యక్రమాన్ని సర్పంచ్ పాండురంగన్న అధ్యక్షతన వెలుగు ఏపీఎం రామేశ్వర్ నిర్వహించారు. ఎంపీడీఓ, ఈఓఆర్డీ ఈశ్వరయ్య స్వామి పాల్గొని జెండర్ సమస్యలు, మహిళల హక్కులు, పరిరక్షణ తదితర అంశాలపై అవగాహన కల్పించారు. అనంతరం స్థానిక మండల పరిషత్ కార్యాలయం నుంచి ర్యాలీ నిర్వహించారు. అధికారులు మహిళలు, బాలికల సంరక్షణ చట్టాలను వివరించారు. మానహారంగా ఏర్పడి ప్రతిజ్ఞ చేశారు. ఎంఈఓ జ్యోతి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ మల్లేశ్వరి, వైద్యాధికారులు, వెలుగు సీసీలు, సచివాలయ ఉద్యోగులు, మహిళలు పాల్గొన్నారు.

కల్లూరు: లింగ వివక్షకు వ్యతిరేకంగా జాతీయ ప్రచార కార్యాచరణ ప్రణాళిక కార్యక్రమాన్ని రూపొందించాలని ఎంపీడీఓ నాగేషాచలరెడ్డి అధికారులను ఆదేశించారు. సోమవారం కల్లూరు మండల మహిళా సమాఖ్య కార్యాలయంలో జెండర్ అంశాలపై చర్చించారు. కార్యక్రమంలో భాగంగా నవంబర్ 25 నుంచి డిసెంబర్ 23 వరకు గ్రామాల్లో అవగాహన ర్యాలీలు, అంతర్గత ఫిర్యాదుల కమిటీని బలోపేతం చేయలన్నారు. స్వయం సహాయక సంఘాల చేత జెండర్ ప్రచారం నిర్వహించాలని సూచించారు. ఏపీఎం పుష్పవతి, ఐసీడీఎస్ సిబ్బంది, సీసీలు, వీఓఏలు, గ్రామ సంఘం ప్రతినిధులు పాల్గొన్నారు.

ఘనంగా కార్తీక పూజలు



కోడుమూరులో ప్రత్యేక అలంకరణలో భీమలింగేశ్వర స్వామి



సి.బెళగల్ ఈశ్వరాలయంలో కిక్కిరిసిన భక్తులు



భీమలింగేశ్వర స్వామి ఆలయంలో పోటెత్తిన భక్తులు

సి.బెళగల్: మండలంలోని గ్రామాలలో ప్రజలు, భక్తులు కార్తీక సోమవారంను ఘనంగా జరుపుకున్నారు. తెల్లవారుజామున పుణ్యస్నానాలు ఆచరించి ఆయా గ్రామాలలోని శివాలయాలకు చేరుకుని భక్తిశ్రద్ధలతో కార్తీక దీపాలను వెలిగించి మొక్కులు చెల్లించుకున్నారు. సి.బెళగల్ ఈశ్వరాలయానికి పెద్ద ఎత్తున భక్తులు తరలిరావడంతో కిటకిటలాడింది. కోట వీధిలోని రాజరాజేశ్వరి దేవి ఆలయంలో మహిళలు దీపాలు వెలిగించి భక్తిని చాటుకున్నారు. కృష్ణదొడ్డి గ్రామ కొండపై వెలసిన కోనవేంకటేశ్వర స్వామి కొండ మెట్లపై, ఆలయ పరిసరాలలో భక్తులు దీపాలను వెలిగించారు. పోలకల్‌లోని శ్రీ చెన్న సోమేశ్వర స్వామి, బురాన్‌దొడ్డి, కంబదహాల్, కొత్తకోట, ముడుమాల, గుండ్రేవుల, సంగాల, కొండాపురం తదితర గ్రామాలలో ఆలయాలలో భక్తులు ప్రత్యేక పూజలు చేశారు.

కోడుమూరు రూరల్: మండలంలో సోమవారం ఉదయం నుంచి ఆయా శివాలయాలకు భక్తులు, మహిళలు పోటెత్తి శివుడికి అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. కోడుమూరు పట్టణంలోని కోటవీధిలో వెలసిన భీమలింగేశ్వస్వామి స్వామి ఆలయంలో శివస్వాములు వైభవంగా కార్తీకమాస పూజలను నిర్వహించి వందలాది మంది భక్తులకు అన్నదానం చేశారు. సాయంత్రం స్వామి వారి ఊరేగింపు కార్యక్రమాన్ని పట్టణ పురవీధుల గుండా వైభవంగా నిర్వహించారు.